

ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి

ప్రతిభా విద్యార్థులకు మాజీ మంత్రి సన్మానం

వనపర్తి టౌన్, మే 10 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితన స్వగృహంలో శాలువాతో సన్మానించి అభినందించారు. శ్రీరంగాపురం మండలానికి చెందిన ఎం.డీ ఇమ్రాన్ అజామ్ 543 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన రాకేశ్ 550మార్కులు సాధించారు. వీరిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పెబ్బేరు, వనపర్తి మండల అధ్యక్షుడు మాణిక్యం, రాములు, జోహెబ్రూస్సేన్, చిట్యాల రాము, ఏకే పాషా ఉన్నారు.

ప్రతి గింజనూ కొంటాం..

వీపనగండ్లలో కల్లాల్లో వద్ద నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వీపనగండ్ల, మే 10 : యాసంగిలో పండించిన ప్రతి వరి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని.. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంతోపాటు మండలంలోని కల్వరాల, తూంకుంట గ్రామాల్లో శనివారం పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వారంరోజుల వరకు పూర్తి స్థాయిలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఎండ తీవ్రతను బట్టి కొనుగోలు కేంద్రాల వద్ద టెంటు ఏర్పాటు చేసి తాగునీరు వంటి కనీస సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక లారీ ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఆరుగాలం కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రోజుల తరబడి కల్లాల దగ్గర ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెబ్బేరు పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ

- ఎస్పీ రావుల గిరిధర్

పెబ్బేరు, మే 10 : వేసవిలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తుంటారని, అందుకని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. శనివారం ఆయన పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతి ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను అమర్చుకోవాలని అంటూ ఆయన దాని పనితీరును వివరించారు. సెంట్రల్ లాక్ వల్ల దొంగలకు తలుపులు తెరవడం సాధ్యం కాదని చెప్పారు. వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లడం, ఉక్కపోతకు చాలా మంది ఆరుబయట, మిద్దెలపై నిద్రిస్తుంటారని వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు కూడా రాత్రి పూట గస్తీ పెంచాలని ఆదేశించారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అనంతరం కంచిరావుపల్లిలో జరుగుతున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎస్పీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

జోగులాంబ సన్నిధిలో కలెక్టర్ దంపతులు

ఆలయంలో కలెక్టర్ సంతోష్ దంపతులు

అలంపూర్,మే 10 : పట్టణంలోని జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అంతకు ముందు వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో వారు మహా మంగళహారతి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, **MOHD. IRSHAD AHMED,** R/o H.No: 1-10-87/4/A, Shashab Gutta, Mahabubnagar town and Dist., Telangana, hereby State that my name was recorded in my Passport No. **K1815019** as **MOHAMMED IRSHAD AHMED** S/o **MOHAMMED NAZEER AHMED.** My actual and correct name as per Aadhar card is **MOHD IRSHAD AHMED** S/o **MOHD NAZEER AHMED.**

NT-MBNR

FINANCIAL SERVICES

★**Sharing-Properties available** for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.

NT-336491-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ఇష్టారాజ్యం !

- రోడ్డుపై నిలుపుతున్న తోపుడుబండ్లు
- నాయకుల అండతో వ్యాపారుల ఆగడాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

పాత ఎంవీఐ కార్యాలయం ఎదుట రోడ్లపైనే వ్యాపారాలు

గద్వాల టౌన్, మే 10 : జిల్లా కేంద్రంలో తోపుడుబండ్ల వ్యాపారం ఇష్టారాజ్యంగా తయారైంది. రోడ్లపైనే బండ్లను నిలిపివేస్తూ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. తోపుడు బండ్లు మొత్తాన్ని కేవలం ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు మాత్రమే నడుపుతున్నారు. చిరువ్యాపారులకు బండ్లను కిరాయికి ఇస్తూ వారి నుంచి అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. అంతేకాక ప్రధాన కూడళ్ల వద్ద కూలీలను పెట్టి బండ్ల వ్యాపారాలు నిర్వహిస్తూ కూడళ్ల వద్ద అజమాయిషి చెలాయిస్తున్నారు. ప్రధాన రహదారులు, చౌరస్తాలను లక్ష్యంగా చేసుకొని రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా అంబేద్కర్ చౌరస్తా, టీటీడీ ఎదుట, పాతబస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, రాయిచూర్ రోడ్డు మార్గాన ఉన్న రైల్వేబిడ్జి కింద అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అలాగే కర్నూలు జిల్లాకు చెందిన కొందరిని తీసుకొని రోడ్డుపై డబ్బాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించిన ఎలాంటి చర్యలు తీసుకోరన్న ధైర్యాన్ని అధికారులు, పాలకులు కల్పించడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

వనపర్తి టౌన్, మే 10 : ఈనెల 20వ తేదీన జరుగనున్న దేశవ్యాప్త కార్మికుల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాలి టెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్తకోట రోడ్డు, శంకర్‌గంజ్, కమాన్ చౌరస్తా, గాంధీ చౌక్, రామా టాకీస్, అంబేద్కర్ చౌక్, రాజీవ్‌చౌక్, న్యూ బస్టాండ్ మీదుగా మర్రికుంట వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోక్ష మాట్లాడుతూ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికుల సార్వత్రిక సమ్మెను చేపడుతున్నారు. 1926లో పోరాడి ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సాధించుకున్నామని, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, వేతనాలు పెంచుకునే హక్కు, పీఎఫ్, ఈఎస్ఐ చట్టం మొత్తం 29 చట్టాలను రూపొందించకోగా వాటిని రద్దుచేసి ఎలాంటి హక్కులు లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఐదేండ్లు పార్లమెంట్‌లో అమోదం పొందిన అమలు కాకుండా పోరాడి ఆపగలిగామని వారు గుర్తుచేశారు. ఆదాని, అంబానీకు నరేంద్ర మోదీ ప్రభుత్వం దోచిపెడుతుందన్నారు. అన్ని రంగాల్లోని కార్మికులు మే 20వ తేదీన జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సంఘాల నాయకులు గణేశ్, మదన్, రమేశ్, సునీత, బాలస్వామి, రత్నయ్య, నందిమల్ల రాములు, శ్రీనివాసులు, రామకృష్ణ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య కార్యాచరణ సంఘాల నేతలు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి నర్సింహ

సమ్మెను జయప్రదం చేయాలి

అయిజ, మే 10 : ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబరు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, 8 గంటల పని దినం కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి రూ. 600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న మున్సిపాలిటీలోని కొత్త బస్టాండ్ ఆవరణలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి, సభను నిర్వహించనున్నట్లు, ఈ సభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో మహేంద్ర, వీరేశ్, ఆనంద్, నరేశ్, చిట్టెమ్మ, అన్నమ్మ, సుశీల, రాజేశ్, శివ, మల్దకల్ తదితరులు పాల్గొన్నారు.

వరి గడ్డి దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం

మల్దకల్, మే 10 : మండలంలోని ఎల్కూర్ గ్రామానికి చెందిన రైతు ఎద్దుల గుండన్న పశువుల మేత కోసం వరి గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకవస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో దగ్ధమైన ఘటన శనివారం చోటు చేసుకున్నది. బాధితుడి కథనం ప్రకారం బీచుపల్లి పరివాహక ప్రాంతం నుంచి శనివారం ఉదయం వరిగడ్డిని ట్రాక్టర్‌లో తీసుకోస్తుండగా ఎల్కూర్‌లో తన పశువుల దొడ్డి సమీపంలో ఎల్‌టీ వైర్లు గడ్డికి తగలడంతో పూర్తిగా అగ్నికి అహుతి అయిందన్నారు. గమనించిన ప్రజలు నీటితో అగ్నిని ఆర్పి వేశారన్నారు. గడ్డితోపాటు ట్రాక్టర్ కూడా దెబ్బతిన్నదన్నారు. దీంతో మొత్తం రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తకోట, మే 10 : ఇంట్లోని సమస్యతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అప్పరాల గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై కథనం ప్రకారం గ్రామానికి చెందిన పుల్లన్నకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు శివ(21) తన తండ్రితో కొత్త ఆటో కొనివ్వమని, దానితో నేను బతుకు తానని తెలిపాడు. తండ్రి సానుకూలంగా స్పందించి కొన్నిరోజులు ఆగితే కొనిస్తానని చెప్పాడు. కొన్ని రోజులుగా ఈ సమస్య వారి ఇంట్లో నడుస్తుండగా, ఈ నెల 9వ తేదీ శుక్రవారం తండ్రితో గొడవ పడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడన్నారు. బయటి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన శివ ఆటో కొనివ్వకపోతే మనస్తాపంతో పురుగుల మందు తాగానని తండ్రితో చెప్పడంతో వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వనపర్తి జిల్లా దవాఖానకు తీసుకుళ్లారని తరలించారన్నారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. శివ మృతి విషయంలో ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని తెలుపగా విచారణ రీత్యా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసిన డీఎస్పీ

అలంపూర్, మే 10 : శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ మెయింటెనెన్స్ చేయాలని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని గద్వాల డీఎస్పీ మొగులయ్య అన్నారు. శనివారం ఆయన అలంపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని ఇదివరకే నమోదైన అట్రాసిటి కేసు విషయంలో విచారణ చేపట్టారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మోసపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటస్వామి, శిక్షణ ఎస్సై కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

గోపాల్‌పేట, మే 10 : మండలకేంద్రం సమీపంలోని చాకల్‌పల్లి రోడ్డులో శుక్రవారం మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన శారద (40) మృతిచెందిన సంఘటన తెలిసిందే. దీనిపై శనివారం మృతురాలు భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై నరేశ్ తెలిపారు. తరచూ చిన్న చిన్న కుటుంబ తగాదాలతో జీవితంపై విరక్తి చెంది క్షణికావేశంలో శారద కల్లుతో పాటు పెట్రోల్ తాగి మృతి చెందినట్లు మృతురాలు భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. మృత దేహానికి వనపర్తి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కూతురు జ్యోతి, కొడుకు సురేశ్ ఉన్నారు.

మొండికుంట చెరువు వివాదం పరిష్కారం

రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద మత్స్యకారుల సంఘం నాయకులు

వనపర్తి టౌన్, మే 10 : జిల్లా కేంద్రంలోని మర్రికుంట సమీపంలో మొండికుంట చెరువు వివాదం పరిష్కారమైనట్లు మత్స్యకార సంఘం నాయకులు తెలిపారు. మొండికుంట చెరువు వివాదం ప్రైవేట్ వ్యక్తులకు, మత్స్య కార్మిక సంఘం సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకొని శనివారం పరిష్కారమైనట్లు చెప్పారు. మత్స్యకార సొసైటీకి చెందిన డాక్యుమెంట్లు, అదే విధంగా ఫిషరింగ్ సొసైటీ ఏడీ అనుమతించిన పర్మిషన్ పత్రాలను, రెవెన్యూ శాఖ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను అన్ని పరిశీలించి ఎస్సై మొండికుంట చెరువు మత్స్య పారిశ్రామిక సంఘానికే చెందుతుందని, మత్స్యకారులు చేపలు పట్టుకునే వీలుందని విచారణలో తేలిందని మత్స్యకారులు చెప్పారు. ఎవరైనా చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లినా, చేపలు పట్టే మత్స్యకారులపై దాడి, వాగ్వాదానికి దిగినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నందిమల్ల చంద్రమౌళి, మత్స్య పారిశ్రామిక అధ్యక్షుడు బోలమోని కృష్ణయ్య, ఉందెకోటి లక్ష్మయ్య, నాగేంద్రం, బాలస్వామి, మన్నెం, స్వామి, వెంకటేశ్, రాములు, కురుమూర్తి తదితరులున్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

అందాల పోటీలు రద్దు చేయాలని నిరసన తెలుపుతున్న చైతన్య మహిళా సంఘం సభ్యులు

గద్వాల, మే 10 : మహిళల ఆత్మగౌరవాన్ని, అభిమానాన్ని భంగపరిచే అందాల పోటీలను రద్దు చేయాలని,72వ ప్రపంచ సుందరి పోటీలను విరమించుకోవాలని చైతన్యమహిళా సంఘ రాష్ట్రకన్వీనర్ జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు జయమ్మ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ నగరం వేదిక కానున్నదని గొప్పగా చెబుతున్నాడని, ఈ అందాల పోటీల వల్ల తెలంగాణకు ఒరిగేది ఏమి లేదన్నారు. ప్రజలు, తెలంగాణ మహిళలకు ఏ మాత్రం ఉపయోగపడని ఈ అందాల పోటీలకు కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందాల పోటీల్లో అంగంగా ప్రదర్శనలతో అర్ధనగ్న సౌందర్యాన్ని ప్రదర్శించడం స్త్రీల ఆత్మాభిమానాన్ని భంగపర్చడమే అన్నారు. ఈ సిగ్గుమాలిన అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రేవతి, వెంకటమ్మ, లక్ష్మమ్మ, రాణి పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

భారత ఆర్మీకి సంఘీ భావం తెలుపుతూ కొత్తకోట పట్టణంలో ర్యాలీ నిర్వహించిన వాకర్ క్లబ్ సభ్యులు

గద్వాలటౌన్, మే 10 : పాకిస్తాన్ దాడుల్లో దేశాన్ని కాపాడేందుకు తన ప్రాణాలు పణంగా పెట్టి అమరుడైన వీర జవాన్ మురళీనాయక్‌కు బీజేపీ నాయకులు, ప్రజలు ఘన నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం జవాన్ చిత్రపటానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. వీర జవాన్ త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరవదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కారక్రమంలో బండ్ల వెంకట్రాములు, చిత్తారికిరణ్, రవికుమార్, కిష్టన్న, రజకజయశ్రీ పాల్గొన్నారు.

అయిజ మండలంలో..

అయిజ, మే 10 : ఉగ్రవాదులతో పోరాడి అసువులు బాసిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి శనివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ కూడలిలో పూలమాల వేసి నివాళులర్పించారు. భారత తల్లుల రక్షణ కోసం అమరుడైన మురళీనాయక్ సేవలు చరిత్రలో చిరస్థాయికిగా నిలుస్తాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, అశోక్, అక్కున్న గౌడ్, శేషిరెడ్డి, నల్లన్న, వెంకటేశ్, నర్సింహ, రఘు, కృష్ణ, మధు, వీరరాఘవ రెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

కొత్తకోట పట్టణంలో శాంతి ర్యాలీ

కొత్తకోట, మే 10 : భారత్ –పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ ప్రజల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరోచిత పోరాటం చేస్తున్న ఆర్మీ జవాన్‌లకు సంఘీభావంగా కొత్తకోట పట్టణ కేంద్రంలో శనివారం ఉదయం వాకర్ క్లబ్‌ల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా వీర మరణం పొందిన మురళీనాయక్‌కు నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా 200 బైక్‌తో భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వాకర్ క్లబ్ గ్రూప్ సభ్యులు, వాకర్ వారియర్స్ వామన్ గౌడ్ బృందం, ఆరోగ్య క్లబ్ బృందం, వందేమాతరం క్లబ్ బృందం ఛత్రపతి క్లబ్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

13న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

గద్వాల, మే 10: పాలి టెక్నిక్‌లో ప్రవేశానికి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ను ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ రామ్మోహన్ శనివారం ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. గద్వాల పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 11గంటల లోపు తప్పనిసరిగా చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశించడానికి అనుమతించబడని తెలియజేశారు. పరీక్షా సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. పరీక్ష పూర్తి అయ్యేవరకు ఎవరూ పరీక్షా హాల్ విడిచి పోవడానికి అవకాశం లేదన్నారు. క్యాలిక్యులేటర్లు, గణిత, భౌతిక పట్టికలు, తెల్లకాగితాలు, ఎలక్ట్రానిక్ పరికరాల వంటివి తీసుకురావడం నిషేధించబడిందన్నారు. ప్రశ్నాపత్రం బుక్‌లెట్ చివరిలో ఇచ్చిన రెండు ఖాళీ పేజీలపై మాత్రమే రఫ్ వర్క్ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఈ నిబంధనలు పాటిస్తూ సమయానికి పరీక్షకు హాజరు కావాలన్నారు. గద్వాల సమీపంలోని గోన్‌పాడ్ ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలలో 400మంది, ఎంఎఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 700మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 280మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 400మంది అభ్యర్థులు కలుపుకొని మొత్తం 1,780 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు కోఆర్డినేటర్ తెలిపారు.

విద్యార్థులు నచ్చిన సబ్జెక్టును ఎంచుకోవాలి

వనపర్తి టౌన్, మే 10 : పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టును ఎంచుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా కార్యదర్శి కేదర్‌నాథ్ యాదవ్ శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకునేటప్పుడు ఆ కళాశాల యొక్క అధ్యాపక బృందం, వసతి సౌకర్యాలు, హాస్టల్ వసతి, సౌకర్యాలు పరిశీలించిన తర్వాత కళాశాలల్లో చేరాలని, తొందరపడి సర్టిఫికెట్లు ఇచ్చి ఇబ్బందులు పడొద్దని చెప్పారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడే సబ్జెక్టును ఎంచుకోవాలని ఆయన తెలిపారు. విద్యార్థుల సలహాల కోసం తెలంగాణ విద్యార్థి పరిషత్ హెల్ప్ లైన్ నెంబర్లు 7386820819, 9959395310 ఫోన్‌చేయాలని సూచించారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలి

అలంపూర్,మే 10 : పాకిస్తాన్– భారత్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యేందుకు జోగులాంబ మరింత బలం చేకూర్చాలని శనివారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ అధ్యక్షుడు రాంచంద్రా రెడ్డి, రాజగోపాల్, ఈశ్వరయ్య, రంగస్వామి, జిల్లా , మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్దకల్, మే 10 : పాకిస్తాన్ దేశ ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న యుద్ధంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమవ్వాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో వెలిసిన కన్యకాపర మేశ్వరి ఆలయంలో పట్టణ అర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బాదం శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మద్దెల బండ నాగరాజు, మనసాని నాగరాజు, ప్రవీణ్ శెట్టి, నరేందర్ శెట్టి, అశోక్ శెట్టి పాల్గొన్నారు.

ఐకమత్యంగా పండుగలు నిర్వహించుకోవాలి

హమాలీ సంఘం నాయకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, మే 10 : గ్రామదేవతల పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్ చెప్పారు. జిల్లా కేంద్రంలోని కోట మైసమ్మ దేవత పండుగను ప్రతి ఏడాది హమాలీలు నిర్వహించుకోవడం అనవాయితీ అని, హమాలీ సోదరులు రావుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆర్థికసాయం కోరగా పండుగను నిర్వహించుకునేందుకు రూ.15వేల అందించారని అశోక్ తెలిపారు. ఫోన్‌లో హమాలీ సోదరులతో రావుల మాట్లాడారు. కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, రాబోయే రోజుల్లో తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఐకమత్యంతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం హమాలీ సోదరులకు రూ.15వేలను నందిమల్ల అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా హమాలీ సంఘం అధ్యక్షుడు ఆదామ్, చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి విష్ణు, శివ, లక్ష్మయ్య, రాజు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

మొబైల్‌ఫోన్లు రికవరీ

ఎర్రవల్లి చౌరస్తా, మే 10 : కోదండాపూర్ పీఎస్ పరిధిలో గత కొన్ని రోజులుగా పోగొట్టుకున్న 9 మొబైల్‌ఫోన్లను బాధితుల